5




పారదర్శకత కోసమే
## సమాచార హక్కు చట్టం

- ప్రభుత్వ ఆఫీసుల్లో సిటిజన్ చార్ట్ ఉండాలి
- పీవోవో అధికారుల సదస్సులో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

గురువారం | 14 ఆగస్టు 2025 | 12 పేజీలు





12

# కవ్వాల్ టైగర్ జోన్‌లో జెండా ఊపి భారీ వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రభాత సమాచారం, జన్నారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల రాకపోకలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మంచిర్యాల డీఎఫ్ఓ శివ్ఆశిష్ సింగ్ బుధవారం పచ్చజెండా ప్రారంభించారు. మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తపాల్‌పూర్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ 16 టైర్ల లారీకి పచ్చజెండా ఊపి, రూ.150 రుసుము చెల్లించి రసీదు తీసుకున్నారు. అనంతరం అదే లారీలో కూర్చుని జన్నారం వరకు ప్రయాణించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుమతులు లభించిన నేపథ్యంలో భారీ వాహనాలను మోటారు వాహన చట్టం ప్రకారం నడపాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే భారీ లారీలు నడపాలని, అలాగే వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం తక్కువ వేగంతో ప్రయాణించి వన్యప్రాణులకు హాని కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను ఈ సందర్భంగా పలువురు సన్మానించారు. కార్యక్రమంలో జన్నారం ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి. సుష్మారావు, తాళ్లపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సాగరిక, ఫారెస్ట్ సెక్షన్, బీట్ ఆఫీసర్లు నహీదా, రైమోద్దీన్, కృష్ణమూర్తి, పద్మజరాణి, ఎస్పై అనూష పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో..
## దంచికొట్టిన వర్షం

- పలు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- ఆసిఫాబాద్ జిల్లాలో వట్టివాగు కుడి కాలువకు గండి
- తాండూరులో గర్భిణీని వాగు దాటించిన గ్రామస్తులు
- బెజ్జూరు మండలంలో పోటెత్తిన దిందా వాగు..



10

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను వర్ష బీభత్సం కుదిపేసింది. ప్రధానంగా తూర్పు జిల్లాపై వరుణ ప్రభావం ఎక్కువగా ఉంది. మంచిర్యాల, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బుధవారం వరదలతో పెద్దఎత్తున జనజీవనం స్తంభించింది. ఆదిలాబాద్ జిల్లాలో భారీగానే వర్షాలు పడ్డాయి. నిర్మల్ జిల్లాలో మోస్తారు వర్షాలు నమోదయ్యాయి. కొమరం భీం ప్రాజెక్ట్ ఐదు గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. మత్తడివాగు గేట్లు ఎత్తారు. కడెం ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. వట్టి వాగు కుడి కాలువ కొట్టుకుపోయింది.

చెడు వ్యసనాలకు
## దూరంగా ఉండాలి

క్రీడాకారులు క్రమ శిక్షణతో ఎదగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. నషా ముక్తి భారత్‌లో భాగంగా విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.






12

నిరుద్యోగులకు కుచ్చు
## టోపీ పెట్టిన కృష్ణ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ
- జిల్లాలో దాదాపు 16 కేసులు

జిల్లాలో ఎస్.కె మైక్రో ఫైనాన్స్ పేరుతో ఉద్యోగాలు ఇస్తానంటూ పెద్ద ఎత్తున మోసం చేసి ఫరారైన కృష్ణను పోలీసులు అరెస్ట్ చేసారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట ఉద్యోగాలు ఇప్పిస్తానంటు ఎస్కే గ్రూప్ కృష్ణ ఎన్ఆర్ఐ అంటూ, సామాజిక సేవ పేరుతో ప్రముఖులతో పరిచయాలు చేసుకొని వందల మందిని బురిడీ కొట్టించి పరారయ్యాడు. బాధితుల పిర్యాదుతో రంగంలోకి దిగిన ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ఎట్టకేలకు చాకచక్యంగా కృష్ణ ను పట్టుకున్నారు.

హైకోర్టు ఆదేశాలతో ఓరియంట్‌లో ఎన్నికలు




వరద ప్రాభావిత ప్రాంతాల్లో
## ఇబ్బందులు లేకుండా చర్యలు



వివరాలు 2లో

- సహాయం కోసం యంత్రాంగం సిద్ధంగా ఉంది
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
- ముంపు బాధితులు అప్రమత్తంగా ఉండాలి
- వాగులను దాటే ప్రయత్నం చేయవద్దు.
- తక్షణ సహాయం కోసం 08736250501
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

### వరద ప్రాభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఏవిధమైన

# ఇబ్బందులు లేకుండా చర్యలు

- సహాయం కోసం యంత్రాంగం సిద్ధంగా ఉంది
- ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
- ముంపు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి
- వాగులు, నదులను దాటే ప్రయత్నం చేయవద్దు
- తక్షణ సహాయం కోసం 08736250501..
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
వాతావరణ శాఖ నివేదిక ప్రకారం భారీ నుండి అతి భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజల రక్షణకు అధికార యంత్రాంగం అప్రమత్తత చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని పలు లోతట్టు, వరద ప్రభావితం ప్రాంతాలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, చెరువులు కుంటల వద్ద వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వర్ష పరిస్థితులలో ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా రక్షణ కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యం, తక్షణ సహాయం కొరకు జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08736- 250501 ఏర్పాటు చేసి 24 గంటలు తక్షణ సహాయ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి రక్షణ చర్యలు చేపడుతుందని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. రైతులు పొలాలలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, వంతెనలు, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదుల వద్దకు ఎవరు వెళ్లకూడదని తెలిపారు. ప్రజలు అత్యవసరం అయినప్పుడు మాత్రమే బయటకు రావాలని, జిల్లాలో జరిగే ఘటనలు, వరద నీటి సమాచారం తక్షణమే కంట్రోల్ రూమ్‌కు అందించాలని, ప్రజల సంక్షేమం కోసం చర్యలు తీసుకునేందుకు వీలవుతుందని తెలిపారు. తాండూర్ మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద పరిస్థితిని పరిశీలించి ప్రజలు అటువైపుగా రాకుండా పోలీస్, రెవెన్యూ, గ్రామపంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించి తక్షణమే భారీ కేడ్లు ఏర్పాటు చేయించారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని రామ్ నగర్ ప్రాంతంలో రోడ్లపై నుండి వరద నీరు ప్రవహించడాన్ని పరిశీలించి వెంటనే నీటిని తొలగించేలా అధికారులను ఆదేశించి చర్యలు చేపట్టారు. కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామం లోనికి చేరిన పాల్వాయి పురుషోత్తం రావు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ పరిస్థితిని పరిశీలించి ప్రమాద స్థాయిలో ఉన్న ఇండ్ల ప్రజలను పునరావాసంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా బ్లీచింగ్, ఫాగింగ్ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భీమిని మండలం చిన్న తిమ్మాపూర్ గ్రామంలోని ఎర్రవాగు లోనికి బ్యాక్ వాటర్ స్థితిని పరిశీలించి, 3 ఇండ్ల ప్రజలను ప్రభుత్వ పాఠశాలకు తరలించి పునరావస చర్యలు చేపట్టారు. రాజారాం గ్రామంలో భీమిని -బిట్టర్ పల్లి గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారి, కల్వర్టు లను పరిశీలించి వెంటనే మరమ్మత్తులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమిని మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామంలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంచాయతీ రాజ్ రోడ్డు, వంతెనను పరిశీలించి వెంటనే పనులు చేపట్టాలని పంచాయితీ రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్ష పరిస్థితులలో అధికార యంత్రాంగం అహర్నిశలు ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటుందని, అవసరమైన ప్రాంతాలలో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, గర్భిణుల సంక్షేమ దృష్ట్యా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో వరద నీరు, అవాంఛనీయ ఘటనలు జరిగినట్లయితే వెంటనే కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని, ప్రజల రక్షణ కోసం తక్షణ సహాయ చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమాలలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# తాడు సహాయంతో గర్భిణిని వాగు దాటించినా పోలీసులు





**తాండూర్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
మండలంలోని నర్సాపూర్ గిరిజన గ్రామానికి చెందిన గర్భిణి యమునకు బుధవారం ఉదయం పురిటి నొప్పు వచ్చాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షంతో కురిసింది. దీంతో నరసాపూర్ సమీపంలోని వాగు ఉప్పొంగి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. గర్భిణీనీ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా వాగులోని వరద ఉధృతికి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య తమ సిబ్బందితో వాగు వద్దకు చేరుకున్నారు. వాగు ఉధృతి కారణంగా గర్భిణిని పోలీసులు స్థానికుల సహాయంతో తాడుతో వాగు అవతలికి దాటించారు. అనంతరం ఆమెను 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సాహసం చేసి నిండు గర్భిణిని వాగు దాటించడం పట్ల గిరిజనులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వరదల కారణంగా ఏమైనా సమస్యలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సైలు పేర్కొన్నారు.



## రోడ్ల నిర్మాణం చేపట్టాలి

**బెల్లంపల్లి, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణ ప్రధాన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిషన్ మోర్చా ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం పాత సీఎం ఆఫీసు క్రాస్ రోడ్డు దుస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడారు. గుంతల మయమైన రహదారి నిర్మాణం జరిగే వరకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు ప్యాచ్ వర్క్ చేపించాలన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ ఫ్లై ఓవర్ నుండి మొదలుకొని కన్నాల ఫ్లైఓవర్ వరకు కొత్త రోడ్డు నిర్మించాలన్నారు. చౌడేశ్వరి, ఏఎంసీ, గాంధీ విగ్రహం, కన్నాల ఫ్లైఓవర్ వరకు రోడ్డు గుంతలు పడ్డాయన్నారు. వర్షం పడితే గుంతలో నీరు చేరి వాహనదారులు తీవ్ర అసౌకర్యం గురవుతున్నారని వాపోయారు. తూతూ మంత్రంగా గుంతలను పూడ్చడం కాకుండా శాశ్వత రోడ్డు నిర్మాణం చేయించాలనీ డిమాండ్ చేశారు. దీనికి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్, స్థానిక మున్సిపల్ కమిషనర్ రమేష్ తక్షణమే చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో చేసే ఆందోళన కార్యక్రమాలకు అధికారులు బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు.

### ఆర్జీయుకేటి చీఫ్ సెక్యూరిటీ

## అధికారి తీరుమార్చుకోవాలి

**ముథోల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
ఆర్జీయుకేటీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ డి. రాజేశ్ తన తీరు మార్చుకోవాలని తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఆయనపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చీఫ్ సెక్యూరిటీ అధికారి అనుచిత ప్రవర్తన, అధికారం దుర్వినియోగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని శాంతియుత విద్యా వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు విశ్వవిద్యాలయంలో కాకుండా జైలులో ఉన్నట్టుగా అనిపించేలా మారుస్తున్నారని వారు ఆరోపించారు. చట్టవిరుద్ధంగా వ్యక్తిగత వివరాలను సేకరించడం, విద్యార్థుల ఫోన్లను అనుమతి లేకుండా తనిఖీ చేయడం సరికాదన్నారు.

### సీపీఐ మహాసభలను

## జయప్రదం చేయండి

**జన్నారం, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
ఆగస్టు 20 నుంచి 22 వరకు హైదరాబాదులో నిర్వహించే సిపిఐ తెలంగాణ నాల్గవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళిందర్ ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో అందుకు సంబంధించిన గోడప్రతులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆగస్టు 20 నుండి 22 వరకు హైదరాబాదులో జరగబోయే తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈ మహాసభలలో రాష్ట్ర ప్రజా సమస్యలపై మరియు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చించి పలు తీర్మానాలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. అదే రకంగా ఎర్రజెండా పార్టీలు ఎప్పుడైనా ప్రజల పక్షపాతమే గాని ప్రజల యోగక్షేమాల వైపే ఆలోచిస్తాయి కావున మేధావులు కార్మిక



కర్షకులు విద్యార్థులు ప్రజలు ఈ మహాసభల విజయవంతంలో భాగస్వాములు కావాలని పిలుపునివ్వడం జరుగుతోంది అదే రకంగా కమ్యూనిస్టులకు ఆమోగమైన చరిత్ర ఉందని ఆ చరిత్ర సాక్షిగానే రేపు జరగబోయే మహాసభలు నిలువుటద్దమని తెలియజేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వము కేవలము కొంతమంది గుప్త పెట్టుబడిదారులకు దేశ సంపదను దోసి పెడుతుందని ఎద్దేవా చేశారు రేపు జరగబోయే మహాసభలలో కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. సిపిఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న చాడ మహేందర్ రెడ్డి మామిడి విజయ్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది



## రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద





**మంచిర్యాల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో కార్మల్ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఫాదర్ ఫిలిప్ లతో కలిసి హాజరై కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యం కోసం సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించడం ద్వారా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యతో సమాజంలో గౌరవం పెరుగుతుందని, మనిషి దైనందిన జీవితంలో చదువు ఎంతో ఆవశ్యకమని తెలిపారు. బాల్యం నుండి నేర్చుకున్న సంస్కారం, చదువుతో భవిష్యత్తు బావుంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదవాలని, విద్యతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం 10 వేల మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, జిల్లాలో విద్యారంగంపై అధికారులు వహించిన శ్రద్ధ అభినందనీయమని అన్నారు. గత సంవత్సరం నీరు, మురికి నీటి వ్యవస్థ, రహదారులపై ప్రభుత్వం శ్రద్ధ వహించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, ఈ సంవత్సరం విద్యారంగంపై దృష్టి సారించి అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మందమర్రి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలలో ప్రారంభించడం సంతోషంగా ఉందని, ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పరిశ్రమల నిర్వహణకు మానవ శక్తి అవసరమని, ఇందుకుగాను ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ లను అభివృద్ధి చేస్తూ జిల్లాలో 4 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తుందని తెలిపారు. టాటా సంస్థ సమన్వయంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ ఇతర అధునాతన సాంకేతికత కలిగిన కోర్సులను శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని చెన్నూర్ ప్రాంతంలో 1 కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యను చేరువులో అందించడం జరుగుతుందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## భారీ వర్షాల నేపథ్యంలో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

వాతావరణ శాఖ సూచన మేరకు రాబోవు మూడు రోజుల పాటు భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రజా రక్షణ చర్యలలో అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాలలో అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టులు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగుల వద్దకు ఎవరు వెళ్లకూడదని, పోలీసు శాఖ అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్ల సమీపానికి వెళ్ళకూడదని, రైతులు పొలాలలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, చేపల వేటకు ఎవరు వెళ్లకూడదని, అత్యవసర సమయాలలో మాత్రమే ప్రజలు బయటకు రావాలని తెలిపారు. తక్షణ సహాయం, పునరావాస కేంద్రాల సమాచారం ఇతర వివరాల కొరకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736-250501 నంబర్ ఏర్పాటు చేసి, 24 గంటలు తక్షణ సహాయం సేవలు అందుబాటులో ఉంచడం జరిగిందని, జిల్లాలో వరద, ఘటనల సమాచారం ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కు అందించాలని తెలిపారు. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా రానున్న గంటలు పాటు హై అలర్ట్




- అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- అత్యవసర సమయాల్లో డయాల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించండి

**మంచిర్యాల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

రానున్న 72 గంటల పాటు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, వాతావరణ శాఖ సూచించిందని, భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని తెలిపారు. అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. రాగల 72 గంటల్లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదన్నారు. వర్షాలు కురుస్తున్నందున రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజల భద్రత, ప్రాణా రక్షణను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టులు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,కాలువలు, నదులు, రిజర్వాయర్లు,చెరువుల వద్దకు వెళ్లవద్దన్నారు. అదే విధంగా చెట్ల కింద, పాడైన భవనాలు కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండవద్దని, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ ముట్టుకోవద్దని సూచించారు. ఎవ్వరు కూడా ఎట్టిపరిస్థితుల్లో కూడా చెరువులోకి, నాలాలు, డ్యామ్స్, వాటర్ ఫాల్స్ లేదా చేపల వేటకు వెళ్లవద్దన్నారు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్అండ్‌బీ, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్లపై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని జాగ్రత్తగా, నెమ్మదిగా ప్రయాణించాలన్నారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయవద్దని ఆయన సూచించారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి





## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## నషా ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన

**ఆదిలాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

క్రీడాకారులు క్రమ శిక్షణతో ఎదగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన నషా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా క్రీడా పాఠశాల విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఆరోగ్య భారత్ వైపు అడుగులు వేయాలని, అందుకు తగినట్లుగా వ్యాయామం చేయాలని, పౌష్టిక ఆహారం తీసుకోవాలని, క్రీడల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేంద్ర రాథోడ్, కార్యక్రమ సమన్వయకర్తలు సాయికిరణ్, శ్రీధర్, క్రీడా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పొచ్చెర సందర్శన నిలిపివేత

**బోథ్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాల కారణంగా పొచ్చెర జలపాతం వద్ద పర్యాటకుల సందర్శనను తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని బుధవారం బోథ్ ఎఫ్ ఆర్ వో టి.ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్ ఆర్ ఓ మాట్లాడుతూ మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారుల హెచ్చరికల వల్ల పొచ్చెర జలపాతానికి వచ్చే పర్యాటకులు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పర్యాటకులు రావద్దని సూచించారు.



# మాదకద్రవ్యాలను నిరోధించాలి : కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
మాదక ద్రవ్యాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త భారత్ అభియాన్ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వ్యతిరే పోరాటం కేవలం ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాక సామాజిక కర్తవ్యంగా గుర్తిస్తూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియశీల భాగస్వామి అవుతానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారం సంబంధిత అధికారులకు తెలియజేస్తానని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీలు, ఆర్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కెరమెరిలో డ్రగ్స్ రహిత సమాం లక్ష్యంగా మాద్ద్రవ్యాల నివారణ కొరకు ప్రతినిత్యం అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. నాషా ముక్త్ భారత్ అభిమాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మోడి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులచే డ్రగ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లితండ్రులకు, సోదరులకు గంజాయి వాటడం వల్ల కలిగే నష్టాను తెలిపారు. వాంకిడిలో మాదకద్రవ్యాలకు ప్రలజ దూరంగా ఉండాలని ఎస్సై తులసీరాం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద స్థానిక ప్రజలకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల వాడకం రోజు రోజుకు పెరుగుతుందని, దాన్ని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ముఖ్యంగా యువత పెడదారి పడుతున్నారన్నారు.



## మాదకద్రవ్యాల నిరోధానికి
# ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

**నిర్మల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
పాఠశాలలోని విద్యార్థులు సమాజంలో మాదకద్రవ్యాల నిరోధానికై కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి విద్యాశాఖ అధికారి మూడారపు పరమేశ్వర్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్య నిరోధక ప్రతిజ్ఞలో భాగంగా బుధవారం నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈదిగాం యందు విద్యార్థులచే సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం పాటుపడాలని కోరారు. విద్యార్థులు పౌరులను, తమ తల్లిదండ్రులను మాదకద్రవ్యాల వినియోగంపై చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అమ్మకాల వివరాలను కానీ, వాటిని వాడుతున్న వారి విషయాలు కానీ అధికారులకు సూచించి సమాజ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నీరాజారాణి ఉపాధ్యాయులు మోహన్ రావు, మణిందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన పంటలు



**నెన్నెల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టులో ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. పలు గ్రామాలలో ఇండ్లలోకి వర్షం నీరు చేరింది. వరి పొలాలు వరదలో కొట్టుకుపోయాయి. వాగు పరివాహక ప్రాంతాల్లో ఉన్న పత్తి పంటలు దెబ్బతిన్నాయి. వరద ఉధృతికి పత్తి మొక్కలు కొట్టుకుపోయాయి. నెన్నెల, మన్నెగూడెం, లంబాడితండా, జంగాలపేట గ్రామాలల్లో పత్తి పంట బాగా దెబ్బతింది. గొల్లపల్లి గ్రామంలో వరి పంట నీట మునిగి చెరువును తలపిస్తుంది. దారులుకూడా కనిపించడం లేదు. పలు చెరువులు మత్తడి దుంకుతున్నాయి. వర్షం మరో 72 గంటల పాటు ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# భైంసా సబ్ కలెక్టర్‌కు సన్మానం

**ముథోల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భైంసా సబ్ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అజ్మీర సాంకేత్ కుమార్‌ను నిర్మల్ జిల్లా బంజారా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్మానం చేశారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సన్మానించారు. నిర్మల్ జిల్లాలో బంజారాల స్థితిగతులు జనాభా వారి జీవన వైవిధ్యం తదితర అంశాలపై సబ్ కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్ బాబు, నాజీమ్ సింగ్, పాండు నాయక్, సాయబురావు, రాజేందర్ తదితరులు ఉన్నారు.



## జాతీయ జెండా భారతీయ
# సమష్టి ఐక్యతకు చిహ్నం




**కుభీర్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భారత జాతీయ జెండా కేవలం ఒక చిహ్నం మాత్రమే కాదని మన సమష్టి ఐక్యతకు గర్వకారణమని ఎన్‌సీసీ కేర్ టేకర్ పార్థసారథి, ప్రధానోపాధ్యాయుడు సట్ల గంగాధర్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు కుభీర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుండి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని అన్ని కాలనీలో జాతీయ జెండాలతో విద్యార్థులు జాతీయ నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. ఎగరాలి ఎగరాలీ భారత జెండా, ఎగరాలి ఎగరాలి మువ్వన్నెల జెండా, మూడు రంగుల ముచ్చటైన జెండా అంటూ పాటలు పాడుతూ జోహార్ అమర్ వీరులకు జోహార్, జై జవాన్- జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. జెండాలు బుడగలు పట్టుకుని విద్యార్థులు రాల్యీలో పాల్గొని హర్ ఘర్ తిరంగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ జిల్లాలోని విద్యా సంస్థలు,
# అంగన్వాడీ కేంద్రాలకు సెలవు

**ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఇంచార్జ విద్యాశాఖ అధికారి దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, తక్షణ సహాయం, సమాచారం కోసం తెలిపారు. జిల్లాలోని లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల కొరకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు.





# కడెం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

**కడెం, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో బుధవారం అధికారులు రెండు గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 694.975 అడుగుల వద్ద ఉంది. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్ ఫ్లో 4358 క్యూసెక్కులు అవుట్ ఫ్లో 12169 క్యూసెక్కులు నీరు గోదావరిలోకి విడుదల చేసిన నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

## బెల్లంపల్లి రాంనగర్ బ్రిడ్జిపై
# పొంగి పొర్లుతున్న వాగు



**బెల్లంపల్లి, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
విస్తారంగా కురుస్తున్న వానలకు బెల్లంపల్లిలోని రామ్ నగర్ బ్రిడ్జిపై వరదనీరు పొంగిపొర్లుతుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. రామ్‌నగర్ వాగు ఉప్పొంగడంతో ప్రజలు రాకపోకలు నిలిచిపోయి ఇళ్లకే పరిమితమయ్యారు. మంగళవారం రాత్రి నుంచి బెల్లంపల్లిలో భారీ వర్షానికి వాగులు, వంకలు వరద నీటితోపరవళ్ళు తొక్కాయి. లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. పట్టణంలోని పలు కాలనీలోనీ ఇళ్లకు వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పట్టణంలోని కాలువలు వరద నీటితో పరుగులు పెడుతున్నాయి.

# సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి



**బెల్లంపల్లి, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భారత కమ్యూనిస్టు పార్టీ నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ బెల్లంపల్లి పట్టణ కార్యాలయంలో బుధవారం సీపీఐ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య మాట్లాడుతూ... భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఈ దేశ స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిందన్నారు. పీడిత ప్రజలు, కార్మికుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు జరిపిందని తెలిపారు. ఈ పోరాటాలతోనే ప్రైవేటు రంగ బ్యాంకులు జాతీయం అయ్యాయన్నారు. ప్రజలకు జీవించే హక్కు గురించి ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందని తెలిపారు. తెలంగాణ నైజాం నవాబుకు, పెత్తందారు వ్యవస్థకు, దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, దున్నేవాడికే భూమి కావాలని మహెూన్నతమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. లక్షలాది ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉన్నదనీ పునరుద్ఘాటించారు. రైతాంగ సాయుధ పోరాటంలో వేలాది మంది కమ్యూనిస్టులు నెలకొరిగారన్నారు. మహెూన్నతమైన చరిత్ర కలిగిన కమ్యూ నిస్టు పార్టీ నాలుగోవ రాష్ట్ర మహాసభలు మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో జరుగుతున్నారు.

# పాఠశాలలకు సెలవు

**ఆదిలాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షాల కారణంగా విద్యార్థుల రాకపోకల పై ప్రభావం పడుతున్న నేపథ్యంలో, ఉట్నూర్, ఇచ్చోడ, సిరికొండ, బోథ్, సోనాల మండలాలలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు లోకల్ హాలీడే ప్రకటించినట్లు ఐటిడిఎ పిఓ, ఇంఛార్జి విద్యాశాఖ అధికారి ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత మండలాలలకు, పాఠశాల ప్రిన్సిపల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం






**ప్రభుత్వ ఆఫీసుల్లో సిటిజన్ చార్ట్ తప్పనిసరి**
**పాలనలో పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం**
**రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి**

**నిర్మల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
పాలనలో పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ను తప్పనిసరిగా ప్రదర్శించాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డా. చంద్రశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్ర సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో పీఐవో అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సమాచార కమిషనర్లు పర్వీన్, భూపాల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో నిర్మల్ ఒకటన్నారు. పీఐవో అధికారులు ప్రజలకు సమయానికి, పూర్తి సమాచారాన్ని అందించాలి అని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా, చట్టంలో ఉన్న సమయపరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. సమాచారాన్ని దాచిపెట్టడం, తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఆర్టీఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ శాఖలు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. నిర్మల్ జిల్లాలో ఆర్టీఐ అప్పీల్ కేసులను కలెక్టరేట్లో కమిషన్ ప్రత్యేకంగా పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలోని అన్ని పీఐవో అధికారులు చట్టపరమైన నిబంధనలను పూర్తిగా అనుసరించాలి అని పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ కమిషనర్లు పర్వీన్, భూపాల్ మాట్లాడుతూ, ఆర్టీఐ చట్టం సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత పీఐవో, ఏపీఐవోలదేనన్నారు. కమిషన్ ఏర్పాటు తర్వాత 18వేల కేసుల్లో 2300కుపైగా పరిష్కరించామన్నారు. అనంతరం స.హ. చట్టంపై సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో పీఐవో అధికారులకు సమాచార హక్కు చట్టం నిబంధనలు, దరఖాస్తుల పరిష్కార విధానం, అప్పీల్ ప్రక్రియపై పవర్ పెయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. అనంతరం కమిషనర్లను జ్ఞాపికలతో కలెక్టర్, అధికారులు సత్కరించారు. సమావేశానికి ముందు కలెక్టరేట్ ప్రాంగణంలో కమిషనర్లు, కలెక్టర్ మొక్కలు నాటి నీరుపోశారు. సదస్సు అనంతరం, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో వివిధ సమాచార హక్కు దరఖాస్తులు, అప్పీల్స్‌పై ఇయరింగ్ (విచారణ) నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు, పిఐఓలు, ఎపిఐఓలు పాల్గొన్నారు.





## గోదావరి పరివాహక ప్రాంత వాసులకు హెచ్చరికలు జారీ

**ఖానాపూర్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి పరివాహక వాసులకు అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం మండలాల ప్రజలు గోదావరి పరివాహక ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని సుర్జాపూర్, బాదనకుర్తి, చింతల్ పేట్, మస్కాపూర్ గ్రామాల్లో పర్యటించి రైతులు, మత్సకారులు, ప్రజలకు పలు సూచనలు చేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని మైకు ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నీటి పారుదల శాఖ అధికారులున్నారు.



## ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలలో 10వ తరగతి పూర్తి చేసుకొని ఇంటర్మీడియట్ చదువుతున్న నిరుపేద విద్యార్థులకు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ వారు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో సంస్థ డివిజనల్ మేనేజర్ రెల్ల చంద్రశేఖర్, సీనియర్ ఏరియా మేనేజర్ పోకల నరసింహారావు, చెన్నూర్, పెద్దపల్లి శాఖల మేనేజర్లు సిరిపంగి నాగరాజు, శ్రీధర్లతో కలిసి విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో ఉత్తమ మార్కులతో 10వ తరగతి పూర్తి చేసిన దమ్ము లాస్య, తోటపెల్లి మౌనిక, సందనవేని పూజ, గొమాస అశ్రిత లకు ఇంటర్మీడియట్ విద్య కొరకు ఉపకార వేతనాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచాలి



**నిర్మల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి సమాచార హక్కు దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు రాష్ట్ర కమిషనర్లకు బుధవారం సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ హైదర్ వినతిపత్రం అందించారు. నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కమిషనర్లు మోసిన పర్వీన్ శ్రీభూపాల్‌కు వినతి పత్రం అందించారు. నిర్మల్ జిల్లాలో తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై పూర్తి సమాచారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్ జాతీయ మానవ హక్కుల సాయ సంగం నాయకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## సబ్ కలెక్టర్‌ను కలిసిన నాయకులు

**ముథోల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భైంసా డివిజన్ సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌ను మాజీ జెడ్పిటిసి లక్ష్మీనర్సగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్ కలెక్టర్ నూతన ఉద్యోగ బాధ్యతలు చేపట్టండంతో నాయకులు కలిసి సన్మానించారు. ముథోల్ నియోజక వర్గంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్ రాథోడ్, మాజీ ఎంపిటిసి ఆత్మ స్వరూప్, మాజీ సర్పంచ్‌లు రాంచంధర్, శ్యామ్‌రావ్, నాయకులు సాయిలు, సాహెబ్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్, మోదీ దిష్టిబొమ్మ దహనం

**నిర్మల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తి రంగాల్లో విదేశీ కార్పొరేట్ వ్యవస్థ రుద్దడాన్ని నిరసిస్తూ భారత సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నిర్మల్‌లో నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వ్యవసాయ ఉత్పాదకరంగాలు ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడం వల్ల దేశంలో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ప్రభుత్వం వెంటనే దీన్ని అడ్డుకోవాలని నినాదాలు చేశారు. సంఘం నాయకులు నందిరామయ్య నూతన కుమార్ రాజన్న గంగన్న రామ్ లక్ష్మణ్ లక్ష్మి గఫూర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.



## మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని నివాస ప్రాంతాల్లో ఎక్కడ మురుగునీరు నిల్లకుండా చర్యలు చేపడుతామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుదవారం జిల్లాలోని ఆసిఫాబాద్ పటట్టంలోని పైకాజీనగర్‌లోని మురుగు నీటి వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రాత్రి కురిసిన వర్షానికి పట్టంలోని మురుగు కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో చేరిన మురుగు నీటిని మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలనీలో శాశ్వత ముఉగు కాలువలను నిర్మించాలని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే మూడు రోజులలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రజలకు తాగునీటిని అందించాలని తెలిపారు. క్లోరినేషన్ పనులు, బ్లీచింగ్ పాగింగ్, అయిల్ బాల్స్ పిచుకారి సకాలంలో చేపట్టాలని తెలిపారు.

# భీమారం ఐటిడిఏ ఉద్యాన నర్సరీలో చెట్ల బహిరంగ వేలం



## రూ. 7,05,000/- ఆదాయం

**భీమారం, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా భీమారంలోని ఐటిడిఏ ఉద్యాన నర్సరీలోని వివిధ రకాల చెట్లను బుధవారం బహిరంగ వేయగా రూ. 7,05,000/- ఆదాయం వచ్చినట్లు ఐటిడిఏ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారిణి ఖుష్బూ గుప్తా తెలిపారు. వచ్చిన ఆదాయం తో నర్సరీ ని బలోపేతం చేయటానికి అవసరమైన చర్యలు తీస్కుంటున్నామని దీనిలో భాగంగా మామిడి, సపోటా చెట్ల ను ఒక మీటర్ ఎత్తులో నరికి మళ్ళీ అంట్లు కట్టనున్నామని తెలిపారు. మామిడి, సపోటా చెట్ల తో పాటు వెదురు, సరుగుడు, దుర్సినం, అశోక, తుమ్మ, ఆయిల్ పామ్, వేప, చింత, నేరేడు, ఉసిరి మొదలైన చెట్లు ఉన్నాయని, వీటిని నరికి మొద్దులను తీస్కొని పోవటానికి ఈరోజు భీమారం ఉద్యాన నర్సరీ లో బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. తొమ్మిది మంది స్థానికులు, వ్యాపారస్తులు పోటాపోటీగా వేలం లో పాల్గొన్నారని ప్రాజెక్టు అధికారిణి తెలిపారు. చివరివరకు వేలంలో పోటా పోటీగా పాల్గొని రూ.7,05,000/లకు భీమారంకు చెందిన ఆకుదారి బాబు నెగ్గించుకున్నారు. ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు వేలంపాట కమిటీ సభ్యులు (ఐటీడీఏ అధికారులు) ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి నర్సయ్య, ఉద్యాన అధికారి సందీప్ కుమార్, మంచిర్యాల జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జనార్దన్, ఐటీడీఏ పరిపాలన అధికారి దామోదర స్వామి, ఫారెస్ట్ డిప్యూటీ రెంజర్ సుధాకర్, బీట్ ఆఫీసర్ అంజిత్, నర్సరీ సిబ్బంది రాజేంద్ర ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.







## 'బ్యాంకు సేవలపై అవగాహన పెంచుకోవాలి'

**దండేపల్లి, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
దండేపల్లిలో మహిళలకు, బ్యాంకు ఖాతాదారులకు బ్యాంకు సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. ఐకెపి ఎపిఎం లక్ష్మి, సిఎఫ్ఎల్ కౌన్సిలర్ వేల్పుల రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పిఎంఎస్బివై, పిఎంజెజెబివై, పిఎంఏబివై వంటి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు

## ఆదిలాబాద్ టూ టౌన్ సీఐగా నాగరాజ్ బాధ్యతలు స్వీకరణ

**ఆదిలాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ టూ టౌన్ సీఐగా నాగరాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి రిపోర్ట్ చేశారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని నూతన సీఐ నాగరాజ్ పేర్కొన్నారు. మెదక్ సీసీఎస్‌లో సీఐగా పనిచేసిన నాగరాజ్, సీఐగా పని చేసిన కరుణాకర్ రావు భూపాలపల్లికి బదిలీ అయ్యారు.



# జనజీవనానికి ఇబ్బందులు రానీయం

**ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో జనజీవనానికి ఇబ్బందులు రానీయకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం తుంపల్లి వాగును జిల్లా ఎస్పీ కాంతిలాల్ సుభాష్‌తో కలిసి బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసరం యితేనే బయటకు రావాలని, వాగులు, నదులు దాటే ప్రయత్నం చేయకూడదని చెప్పారు. వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లు భారీ వర్షాలు కురిసే సమయంలో చేనులలో, అడవులకు వెళ్లకకూడదని సూచించారు. జిల్లాలో గత రాత్రి కురిసన భారీ వర్షం కారణంగా వాగులు,ర ఒర్రెలు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రవహిస్తున్నాయని అన్నారు అధికారులు రక్షణ చర్యల్లో



అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వంతెనలు, వాగులు, కాజ్‌వేల వద్ద బందో బస్తు ఏర్పాటు చేసి ప్రజలు అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వరద ప్రభావిత, లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, సీఐ బాలాజీ వర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# దిందా పోడు రైతులకు అండగా ఉంటాం

**చింతలమానేపల్లి, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
మండలంలోని దిందా గ్రామానికి చెందిన సుమారు 20 మంది పోడు రైతులు దిందా గ్రామం నుంచి హైదరాబాద్ ప్రగతి భవన్‌కు సుమారు 400 కిలో మీటర్లు పాదయాత్రగా వెళ్తుండగా సిద్దిపేట జిల్లాలోని ప్రజ్ఞాపూర్ వద్ద పాదయాత్రగా వెళ్తున్న చింతలమానేపల్లి మండలం దిందా పోడు రైతులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించి ధైర్యం చెప్పారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 400 కిలో మీటర్లకు పైగా పాదయాత్ర చేయడానికి సంకల్పించిన దిందా పోడు ఐతుల సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. అలాగే బీజేపీ రాష్ట్ర నాయకుడు కొత్తపల్లి శ్రీనివాస్ సైతం పాదయాత్రగా వెళ్తున్న దిందా పోడు రైతులను ములుగు జిల్లాలో కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. పోడు రైతులకు న్యాయం చేయాలని 400 కిలోమీటర్ల దూరం నుంచి పాదయాత్రగా వెళ్తున్న వారిని ప్రభుత్వం గుర్తించాలని, వారికి న్యాయం చేయాలని కోరారు. కాగా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని హైదరాబాద్‌కు 400 కిలో మీటర్ల పాదయాత్ర చేస్తున్న దిందా గ్రామస్తులకు గజ్వేల్ నియోజక వర్గం ములుగు ప్రాంతంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా భూమి మాకే ఇవ్వాలని, పోడు పట్టాలిచ్చిన అటవీ అధికారుల అగడాల నుంచి రక్షణ కల్పించాలని, రైతు భరోసా, రైతు భీమా పంట రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంత దూరం వారితో నడిచి వెళ్లారు.



## ప్రకృతివిపత్తులపై అవగాహన

**ముథోల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ముద్గల్ గ్రామంలో బుధవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) ప్రకృతి వైపరీత్యాలు, ఇతర విపత్తుల గురించి ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు నీళ్లలో పడి కొట్టుకపోతే ఎలా కాపాడాలి ,అగ్ని ప్రమాదం జరిగితే ఎలా, పాముకాటు గురైతే ఏం చేయాలి తదితర విపత్తుల గురించి బయటప డేందుకు ప్రజలకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కమాండర్ వినిత్ కుమార్, ఎంపిడిఓ శివకుమార్, ఆర్ఐ నారాయణ పటేల్, కానిస్టేబుల్ సుభాష్, షిటీమ్ సిబ్బంది, ఎన్ డిఆర్ఎఫ్ బృందం, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వరదల బాధితులకు ఎస్సై శ్రీకాంత్ భరోసా



**తిర్యాణి, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
తిర్యాణి మండలంలో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోగా, ఎస్సై శ్రీకాంత్ స్వయంగా గ్రామాల సందర్శించి రక్షణ చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ, వాగులు, జలపాతాల వద్దకు వెళ్లవద్దని ఆయన సూచించారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ ఎస్సై మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాథోడ్ శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ గ్రామాల మధ్య రాకపోకలు బంద్

**లక్షెట్టిపేట, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
లక్షెట్టిపేట మండలంలోని పాత, కొత్త కొమ్ముగూడెం గ్రామాల మధ్య బుధవారం భారీ వర్షాల కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. కొమ్ముగూడెం చెరువు నిండి మత్తడి దుంకడంతో రోడ్డుపైకి ఉధృతంగా ప్రవహించిన నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ రాకపోకలు నిలిచిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

# భీమిని, బెల్లంపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యశాఖాధికారి

**భీమిని, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
భీమిని, బెల్లంపల్లిలోని గురజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంట డాక్టర్ సుధాకర్ నాయక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ ప్రసాద్ ప్రోగ్రాం ఆఫీసర్ వైద్య సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యులు వైద్య సిబ్బంది అప్రమత్తతో ఉండాలన్నారు. గర్భిణిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐదు రోజుల్లో ప్రసవం అయ్యే గర్భిణీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రసవమయ్యే ఆసుపత్రి దగ్గరలో ఉండే సదుపాయం కల్పించాలని ఆదేశించారు.





## రైలు ఢీ కొని ఒకరు మృతి..

# గ్రామస్థుల ఆందోళన

### మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్

**సిర్పూర్ (టి), ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

సిర్పూర్ (టి) మండల కేంద్రానికి చెందిన షేక్ జంషెద్ (44) అనే రైల్వే లేబర్ బుధవారం తెల్లారుజామున రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే గార్డు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే జంషేథ్ మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు, గ్రామస్థులు మృతదేహంతో సిర్పూర్ టీ- కౌటల ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రోడ్డుపై బైఠాయించారు. దీంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ స్తంభించడంతో కౌటల సీఐ సంతోష్ కుమార్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. చివరకు రైల్వే లేబర్ కాంట్రాక్టర్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

### దాడి కేసులో నిందితుడికి

# ఆరు నెలల జైలు శిక్ష

**ఆదిలాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

ఒక వ్యక్తిపై దాడి చేయడంతో అతడు మృతి చెందిన కేసులో నిందితుడికి ఆరునెలల జైలు శిక్ష, రూ. వేయి జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం హల్దా గ్రామానికి చెందిన మేకల రాజు అదే గ్రామానికి చెందిన అముల్లైా 2020 జనవరి 12న దాడి చేశాడు. అనంతరం బాధితుడు అక్కడే కుప్పకూలగా ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. ఈ మేరకు బాధితుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుభీర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో లైజన్ అధికారి ప్రవేశపెట్టిన 18 మంది సాక్షులను ప్రత్యేక పీపీ ముస్కు రమణారెడ్డి విచారించగా.. చేతులతో దాడి చేసినట్లు నేరం రుజు వు అయింది. దీంతో న్యాయమూర్తి శిక్షను ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.

### భార్యపై హత్యాయత్నం..

# భర్తకు అయిదేళ్ల జైలు

**ఆదిలాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు అయిదేళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు బుధవారం తీర్పును వెలువరించారు. 2024 డిసెంబర్ 18న ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడకు చెందిన జాదవ్ ఆనందావు మద్యం మత్తులో భార్య తలపై సుత్తితో దాడి చేశాడు. బాధితురాలిని రిమ్స్ కు తరలించిన అనంతరం ఆమె కుమారుడు జాదవ్ మహేశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో కోర్టు విధుల పోలీసు అధికారి సీహెచ్ సంతోశ్ ప్రవేశ పెట్టిన 10 మంది సాక్షులను పీపీ ఏఏ రహీం విచారించి నేరాన్ని రుజువు చేశారు. దీంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

# పాలగోరి గూడెం ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**జన్నారం, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

పాలగోరి గూడెం ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యే బెడమా బొజ్జో పటేల్ కు పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ప్రభంజనం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కవ్వాల్ అభయారణ్యంలోని పాలగోరి గూడెం ప్రజలకు 112 సర్వే నెంబర్‌లో హక్కు పత్రాలు ఉన్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు వారి గుడిసెలను తొలగించారు. కాబట్టి ఆ గ్రామ ప్రజలకు హద్దులు గీసి పక్క ఇల్లు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే చొరవ చూపించాలని కోరారు. ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించారు. అనంతరం ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ .. త్వరలో పై అధికారులతో మాట్లాడి పాలగోరీల గూడానికి సంబంధించిన ఆదివాసీల కాలనీ నిర్మాణానికై చర్చించి వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జన్నారం మండల నాయకులు పాల్గొన్నారు.



# ఎంత పెద్ద చేప..

### రాళ్లపేట చెరువులో 16 కేజీల చేపలు..

**బెల్లంపల్లి, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో కురిసిన భారీ వర్షానికి చెరువుల్లో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదలతో భారీ చేపలు కొట్టుకొస్తున్నాయి. మండలంలోని రాళ్లపేట చెరువులో 16 కిలోల చేపను కనువిందు చేసింది. మంగళవారం రాత్రి నుంచి విస్తారంగా కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. ఈ నేపథ్యంలో రాళ్లపేట చెరువులో వరద నీటితో కొట్టుకు వస్తున్న పెద్ద పెద్ద చేపలు కంటపడ్డాయి. దీంతో గ్రామస్తులు ఆ చెరువుకు క్యూ కట్టారు. భారీ చేపలు లభించడంతో ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులంతా చేపల కూరతో ఆరగించారు.



# న్యాయం కోసం అంత దూరం వెళ్లాలా..?

**కొత్త భవనాల స్థలం ఎంపిక వివాదం - నిర్మల్ పట్టణంలోని నిర్మించాలని బార్ అసోసియేషన్ తీర్మానం - జిల్లాలో న్యాయవాదుల పోరాటం**





**నిర్మల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించి కోర్టు సముదాయాల భవన నిర్మాణం స్థలం ఎంపిక వివాదమవుతుంది. నిర్మల్ పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో సారంగాపూర్ మం డలంలోని చించోలి గ్రామ శివారులో కోర్టు సముదాయాల భవనానికి రెవెన్యూ అధికారులు ఐదు ఎకరాల స్థలానికి కేటాయించారు. నిర్మల్ జిల్లా కేంద్రం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాల్లో ఒకేచోట కోర్టు సముదాయిక భవనాలను న్యాయమూర్తుల రెసిడెన్ని యలను నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మల్ జిల్లా కూడా రూపాయలు 80 కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో భవన నిర్మాణానికి కావలసిన స్థలం కేటాయించాలని న్యాయశాఖ రెవిన్యూ అధికారులకు సూచించింది. రెండు సంవత్సరాల నుంచి నిర్మల్‌లో కోర్టు భవన సముదాయానికి అవసరమయ్యే స్థలం ఎంపిక కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవిన్యూ ల్యాండ్ రికార్డ్ సర్వే అధికారులు సర్వే నిర్వహించి మూడు ప్రదేశాల్లో ఎంపిక చేశారు. గత ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా వ్యవహరించిన నిర్మల్ జిల్లాకు చెందిన ఏ ఇంద్రకన్ రెడ్డి ప్రత్యేక కృషితో ఈ నిధులు మంజూరు కాగా సోఫీ నగర్ చించోలి బి కొండాపూర్ శివారు ప్రాంతాల్లో కోర్టు సముదాయిక భవనాల నిర్మాణానికి అవసరమయ్యే స్థలం కేటాయించగా అక్కడ కోర్టు భవనాలు నిర్మించేందుకు స్థలం సరిపోకపోవడంతో అధికారులు చించోలి బి గ్రామం వద్ద ప్రభుత్వ భూమి ఉందని గుర్తించి కేటాయించారు.

**దూరంలో నిర్మిస్తే ఇబ్బంది..**

నిర్మల్ జిల్లాలో కోర్టుల సముదాయిక భవనాన్ని నిర్మల్ పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో చించోలి గ్రామ శివారులో స్థలం ఎంపిక చేయడంపై జిల్లాలో న్యాయవాదులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు పరిపాలన న్యాయం అందించి న్యాయవ్యవస్థ పట్టణంలో కాకుం డా సుదూర ప్రాంతాల్లో నిర్మించడం వల్ల అర్జీదారులు కక్షిదారులు న్యాయవాదులకు ఇబ్బందులు ఏర్పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉన్న నాలుగు కోట్లకు నిర్మల్ ఆర్మూర్ భైంసా ఖానాపూర్ బాసర సోన్ లోకేశ్వరం తదితర ప్రాంతాల నుంచి నిర్మల్కు చేరుకొని ఇక్కడి నుండి కోర్టుకు వెళ్లాలంటే మళ్లీ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడం వల్ల ఆర్థిక భారం అవుతుందని న్యాయవాదులు తెలిపారు. కోర్టు సముదాయిక భవనాన్ని నిర్మల్ పట్టణంలోనే నిర్మించాలని నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్ భైంసా ఖానాపూర్ న్యాయవాదులు తీర్మానం చేసి అధికారులకు ప్రజాప్రతినిధులకు ఉత్తరాలు రాశారు. ఇప్పటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కోర్టు సముదాయక భవనాల నిర్మాణ స్థలం ఎంపికపై ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రజలకు సౌకర్యంగా ఉండే ప్రదేశాల్లో నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రస్తుతం ఉన్న కోర్ట్ భవనంలోని స్థలం ఎంపిక చేయండి..**

పెరిగిన అవసరాలకు అనుగుణంగా కోర్టు సముదాయిక భవనాలు నిర్మించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూనే ప్రజలకు న్యాయవాదులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్మల్ కోర్టు నిర్మల్ పట్టణంలోని కోర్టు స్థలంలో వివిధ కోట్లు ఏర్పాటు చేశారు జిల్లా కోర్టును పాత ఇరిగేషన్ కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిపై నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని దీనికి తోడు పాత రెవిన్యూ కార్యాలయం కూల్చివేయడంతో ఆ స్థలాన్ని ఉపయోగించుకుని ఐదు ఎకరాల స్థలంలో భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిర్మల్ న్యాయవాదులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. న్యాయమూర్తులు ఉండే గెస్ట్ హౌస్ లను రెసిడెన్షియలను అవసరమైతే కొండాపూర్‌లో నిర్మించి సముదాయక భవనం మాత్రం నిర్మల్ పట్టణంలో పాత కోర్టుల ప్రదేశంలోనే నిర్మిస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని న్యాయవాదులు పేర్కొంటున్నారు.

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో
# భారీ వర్షం

**గ్రామస్థుల రాకపోకలకు అంతరాయం**
**నీటిమునిగిన పంటలు**
**కుమరం భీం ప్రాజెక్టు ఐదు గేట్ల ఎత్తివేత**



**ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 101.1 మీల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామువరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురువడంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవ హించాయి. కురిసిన భారీ వర్షానికి ఆసిఫాబాద్ మండలంలోని గూడెన్‌ఘాట్ వాగు ఉధృతంగా వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించడంతో సుమారు రెండు గంటలపాటు ఆసిఫాబాద్-చిర్ర కుంట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపో యాయి. వాగు ఉధృతిని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని అధికారులను సూచించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని మజీద్‌వాడకు చెందిన ముత్తహీర్‌షా ఇంటి ప్రహరీగోడ కూలీపోగా, వరద ప్రవహానికి సెప్టిక్ ట్యాంకు కొట్టుకుపోయింది. కుమరంభీం ప్రాజెక్టులోకి 8,333 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో ఐదు గేట్లు పైకి ఎత్తి 21,254 క్యూసెక్కుల వరద నీటిని అదికారులు కిందికి వదిలారు. దీంతో పెద్దవాగు



ఉధృతంగా ప్రవహిస్తోంది. జిల్లాలో బుధవారం ఉదయం వరకు అత్యధికంగా రెబ్బెనలో 219.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిర్యాణిలో 179.8, కాగజ్‌నగర్‌లో 133.6, దహెగాంలో 119.2, కౌటాలలో 112.0, ఆసిఫాబాద్‌లో 115.0, కెరమెరిలో 86.8, వాంకి డిలో 80.6, పెంచికల్‌పేటలో 80.0, సిర్పూర్ (టి)లో 74.4, చింతలమానేపల్లిలో 72.2, జైనూ రులో 71.8, సిర్పూర్(యూ)లో 61.2, బెజ్జూరులో 58.4, లింగాపూర్‌లో 52.6మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

**వాంకిడి :** వాంకిడి మండలంలో మంగళ వారం రాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని చికిలి, ఖమాన, తదితర వాగులు పొంగి పారడంతో రాక పోకలు స్తంభించి పోయాయి. మండలంలోని దుబ్బగూడ గ్రామ సమీపంలోని లో లెవెల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో మండల కేంద్రానికి, ఖమాన గ్రామానికి రాక పోకలు స్తంభించాయి.

**కెరమెరి :** కెరమెరి మండలంలో భారీ వర్షం కురవడంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. లక్మాపూర్ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో సుమారు పది గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

**చింతలమానేపల్లి :** చింతలమానేపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి దిందా వాగు ఉప్పొం గి ప్రవహిస్తోంది. దీంతో గ్రామం నుంచి బయ టకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బాబాసాగర్, నాయకపుగూడ వాగు, రన్‌వెల్లి-టేకంగూడ ఒర్రెపై ఉన్న లోలెవల్ వంతెనపై నీరు ప్రవహి స్తుండడంతో కష్టం మీద ప్రజలు ఒర్రెను దాటారు.

**బెజ్జూర్ :** బెజ్జూరు మండలంలోనిలో లెవల్ వంతెనలు ఉప్పొంగడంతో రాక పోకలు స్తంభించి పోయాయి. మండలంలోని కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్య రెండు లో లెవల్ వంతెనలపై నుంచి భారీగా వరద నీరు పారుతుండడంతో వాగవతల ఉన్న గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. లెవల్ వంతెనలను తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో ప్రవీణ్‌కు మార్‌లు సందర్శించి వాగు ప్రవాహంలో దాట కుండా రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.లో లెవల్ వంతెనలో వద్ద ముళ్ల కంప వేసి రోడ్డును మూసి వేయించారు. వర్షానికి పంట పొలాల్లోవరద నీరు చేరింది.

**దహెగాం :** దహెగాం మండలంలో భారీ వర్షానికి మండలంలోని ఒర్రెలు, పెద్దవాగు, ఎర్రవాగులు, పీపీరావు ప్రాజెక్టు మత్తడి ఉధృంగా ప్రవహిం చింది. ఇట్యాల సమీపంలో కల్వర్టు పై నుంచి, అయిన సమీపంలోని లో లెవల్ వంతెనలు ఉధృంగా వరద నీరు పారడంతో కాగజ్ నగర్- దహెగాం మధ్య రాక పోకలు నిలిచి పోయాయి. ఎర్రవాగు వరద నీరు పీకలుగండం- కుంచవెల్లి గ్రామాల మధ్య రహదారిపై పారడంతో రాకపో కలు నిలిచిపోయాయి. పలువురి ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పెసరికుంట గ్రామంలో ఒక కుటుంబంను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తహసీల్దార్ మునావర్ షరీఫ్ తెలిపారు. ఒడ్డుగూడ, గిరివెల్లి, చంద్రపల్లి గ్రామాల్లో విద్యుత్ మోటారు ఎర్రవా గు, పెద్దవాగు వరద నీటిలో మునిగి పోయా యి. ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో లో లెవల్ వంతె నల వద్ద పోలీసుల పహారా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దహెగాం మండలం పెసరికుంట గ్రామాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా సందర్శించారు. పెద్దవాగు ఒడ్డున నివసిస్తన్న ఐదు కుటుంబాలను సీఎస్ఐ చర్చికి తరలిం చాలని తహసీల్దార్‌కు సూచించారు.

**పెంచికలపేట :** పెంచికలపేటలో పెద్దవాగు, బొక్కివాగు, ఉచ్చమల్లవాగులతో పాటు ఒర్రెలు సైతం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చ్చమల్ల వాగులో లెవల్ వంతెన నుంచి ప్రవహించడంతో రెండు గంటల పాటు రాక పోకలు నిలిచి పోయాయి. పెద్దవాగు వరద ఉధృతితో రహదారులపై నీరు





చేరడంతో కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ, నందిగామ పరివాహక గ్రామాల్లో వందల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. బొక్కివాగు ప్రాజెక్టు మత్తడి ఉధృతంగా ప్రవహంచడంతో మేరేగూడ గ్రామానికి చెందిన పశువులు, పశువుల కాపర్లు ఇబ్బంది పడుతూ మత్తడి దాటారు.

**లింగాపూర్ :** లింగాపూర్ మండలంలో భారీ వర్షానికి మండలంలోని కిమానాయక్‌తండా వాగు, మోతి పట్టార్ వాగు, పిట్టాగూడా వాగు, చోర్‌పల్లివాగు, నాగూగుడావాగు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో సుమారు మూడు గంటల పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు.

**సిర్పూర్(యు) :** సిర్పూర్(యు) మండలంలో బుధవారం ఉదయం సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. సిర్పూర్(యు), దేవుడుపల్లి గ్రామాల రహదారిపై గల వాగు రోడ్డుడ్యాంపై నుంచి వరద నీరు ప్రవహించింది. రాజుల్‌గూడ, కోడ్డిగూడ, అలీగూడ కల్వర్టులపై నుం చి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. భారీ వర్షాల కారణంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రహ్లాద్, ఎంపీడీవో కృష్ణారావు కోరారు.

**సిర్పూర్(టి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రహీముద్దీన్, ఎస్సై కమలాకర్‌లు అన్నారు. బుధవారం సిర్పూర్(టి) మండలం డోర్‌పల్లి వాగు లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు.

# సాత్నాల ప్రాజెక్ట్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ అఖిల్ మహాజన్







**ఆదిలాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం సాత్నాల ప్రాజెక్ట్ ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. ప్రాజెక్టులో నీటిమట్టాన్ని స్వయంగా పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టర్ ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారి విఠల్, తదితరులు ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ కలిసి స్థానిక సత్నాల ప్రాజెక్టును పరిశీలించడం జరిగింది. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఉండాలని అదేవిధంగా ప్రజలు పర్యాటకులు జలపాతాల వద్దకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. వాగులు కల్వర్టుల పై నుండి ప్రవహించే ప్రాంతాలలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని వాటిని దాటకుండా ఉండాలని తెలిపారు.





## కాంగ్రెస్ పార్టీ నాయకుడు
# సయ్యద్ అబ్బాస్ కన్నుమూత

**టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ నివాళి**

**జైనూర్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**
జైనూర్ మండలం, గూడమామాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ అబ్బాస్ బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క వెంటనే వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సయ్యద్ అబ్బాస్ పార్టీ కోసం ఎంతో కృషి చేసిన నిబద్ధత కలిగిన నాయకుడు.పార్లమెంట్ ఎన్నికల్లో తనకోసం ఎంతో కష్టపడ్డాడాని గుర్తు చేసుకున్నారు.సుగుణక్క వెంట కాంగ్రెస్ నాయకులు షేక్ హుస్సేన్, షేక్ యూసుఫ్, సయ్యద్ సలీం,గేడం గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.



## హాట్ ఫోజులతో కుర్రకారులను హీటెక్కిస్తున్న జాన్వీ..

జాన్వీ కపూర్ లెహంగాలో అదిరిపోయిన స్టిల్స్‌తో నెటిజన్లను తన హీటెక్కిస్తుంది. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ కావడంతో ఫొటోలు అదిరిపోయాయని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అయితే జాన్వీ నటించిన 'పరం సుందరి' మూవీ ఆగస్టు 29న థియేటర్స్‌లో విడుదల కానుంది.ఎద అందాలు చూపిస్తూ లెహంగాలో జాన్వీ. నెట్టింట వైరల్ అవుతున్న ఫొటోలు..క్యూట్‌గా, హాట్‌గా భలే ఉందని నెటిజన్లు కామెంట్లు.. త్వరలో జాన్వీ లేటెస్ట్ మూవీ 'పరం సుందరి' రానుంది.




## సందీప్ వంగ సపోర్ట్ తో 'జిగ్రీస్' టీజర్ ...

యంగ్ టాలెంట్ కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా ప్రధాన పాత్రలో నటించిన యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'జిగ్రీస్' టీజర్ విడుదలైంది. యానిమల్, అర్జున్ రెడ్డి వంటి బ్లాక్ బస్టర్ సినిమాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగా ఈ సినిమా టీజర్ ని లాంచ్ చేశారు. "కొంతమంది ఉంటారు శుద్ధపూసలు. ఫస్ట్ వద్దేవద్దు అని షో చేస్తారు. కానీ, కూర్చున్నాక నాకంటే ఎక్కువ తాగుతారు" అంటూ యూత్ కి కనెక్ట్ అయ్యే డైలాగ్ తో టీజర్ మొదలవుతుంది. నలుగురు స్నేహితులు, వారి చుట్టూ సాగే సన్నివేశాలతో టీజర్ నవ్వులు పూయించింది. కొన్ని కొన్ని చోట్ల టీజర్ 'హుషారు', 'ఈ నగరానికి ఏమైంది' వైబ్స్ ఇస్తోంది. నలుగురు స్నేహితులు కలిసి ఒక పాత మారుతీ 800 కారులో గోవా ట్రిప్‌కు వెళ్తారు. ఈ ప్రయాణంలో వాళ్ళ మధ్య జరిగే సరదా గొడవలు, కామెడీ, భావోద్వేగ సన్నివేశాలతో సినిమా ముందుకు సాగుతుంది. ఇది ఒక క్రేజీ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. టీజర్ లో కొన్ని డైలాగులు యూత్ ని బాగా ఆకట్టుకున్నాయి. టీజర్ విడుదల అనంతరం డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. ఈ సినిమా తన చిన్ననాటి స్నేహితుడు కృష్ణ వోదపల్లి నిర్మించాడని తెలిపారు. ఈ రోజుల్లో అశ్లీలత లేకుండా కామెడీ చేయడం చాలా అరుదని, కానీ దర్శకుడు హరీష్ రెడ్డి ఉప్పల దానిని అద్భుతంగా చేశారని ప్రశంసించారు. అలాగే, సంగీతం చాలా బాగుందని, త్వరలో సినిమాలోని పాటలు కూడా విడుదల అవుతాయని తెలిపారు.డైరెక్టర్ హరీష్ రెడ్డి ఉప్పల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కృష్ణ వోదపల్లి నిర్మించారు. కామ్రాన్ సయ్యద్ సంగీతం అందించారు. ఈశ్వర ఆదిత్య సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరించారు. చైతన్య రెడ్డి తూరుపు ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహించారు. టీజర్ చూసిన తర్వాత జిగ్రీస్ సినిమాను ఎప్పుడెప్పుడు రిలీజ్ చేస్తారా? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఫ్యాన్స్. యూత్ ఆకట్టుకునే ఒక మంచి కామెడీ ఎంటర్ టైనర్ గా ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది. ఇందులో మెయిన్ క్యారెక్టర్ రామ్ నితిన్ 'మ్యాడ్' ఫ్రాంచైజీతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. షార్ట్ ఫిలిమ్స్ తో కెరీర్ మొదలు పెట్టిన రామ్.. తన నటనతో మెప్పించి సినిమాల్లో అవకాశాలు దక్కించుకున్నాడు. రామ్ నితిన్ హలో వరల్డ్, ఫిఫ్త్ వేదా, మిస్టర్ నాగభూషణం వంటి వెబ్ సీరీస్ లలో నటించాడు. 'మ్యాడ్ 'సినిమాతో వెండితెరపై ఎంట్రీ ఇచ్చాడు.

## రజనీకాంత్ వైఫ్ షాకింగ్ రియాక్షన్!



సూపర్ స్టార్ రజనీకాంత్ - లోకేష్ కనగరాజ్ కాంబినేషన్లో తెరకెక్కిన 'కూలీ' మరి కొన్నిగంటల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. విడుదలకు ముందే ఈ సినిమా ప్రీమియర్ షో వీక్షించిన రజనీకాంత్ భార్య మూవీపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు తలైవా అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచాయి. కూలీ రజనీకాంత్ కెరీర్ లోనే అత్యుత్తమ చిత్రాలలో ఒకటిగా నిలిచిపోతుందని అన్నారు. అలాగే అభిమానుల మదిలో చాలా కాలం పాటు ఉండిపోతుందని తన రివ్యూను పంచుకున్నారు. సినిమా విజువల్స్, కథ, కథనం ముఖ్యంగా రజనీ నటనను ఆమె ఎంతగానో మెచ్చుకున్నారు. తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా "కూలీ" పై తన రివ్యూను పంచుకున్నారు. కూలీ ఒక మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ అని అన్నారు. ఇది ప్రేక్షకుల మనసు దోచుకోవడం ఖాయమని కొనియాడారు.ఇదిలా ఉంటే 'కూలీ' అడ్వాన్స్ బుకింగ్స్ రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. ఇండియాలోనే కాకుండా ఓవర్ సీస్ లోనూ జోరు చూపిస్తోంది. కేవలం తమిళనాడులోనే రూ. 27 కోట్లకు పైగా అడ్వాన్స్ జరగగా.. దేశవ్యాప్తంగా రూ. 53 కోట్లకు పైగా అడ్వాన్స్ బుకింగ్స్ జరిగినట్లు సమాచారం. ఇక ఓవర్సీస్‌లో రూ.35 కోట్లకు పైగా అడ్వాన్స్ బుకింగ్స్ జరిగినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా రూ. 80 కోట్లుకు పైగా వసూళ్లు రాబట్టింది. దీంతో విడుదలకు ముందే రూ. 100 కోట్ల మార్క్ ని దాటుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.



## సిద్ధుతో అలా చేయడం నచ్చలేదు..

'టిల్లు స్క్వేర్' సినిమాలో లిల్లీ పాత్రను చేయడం పై కర్లీ బ్యూటీ అనుపమ కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. ఎప్పుడూ హోమ్లీగా, ట్రెడిషనల్ రోల్స్ లో కనిపించే ఈ ముద్దుగుమ్మ ఈ సినిమాలో మాత్రం బోల్డ్ అవతార్ లో రెచ్చిపోయి అభిమానులను ఆశ్చర్యపరిచింది. దీంతో మూవీ విడుదలైన టైంలో అనుమప పై తీవ్ర విమర్శలు వెలువెత్తాయి. ఏంటే.. అనుపమ ఇలాంటి పాత్రకు ఒకే చేసింది అంటూ నెట్టింట తెగ చర్చ జరిగింది. అయితే తాజాగా తన లేటెస్ట్ మూవీ పరదా ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ 'టిల్లు స్క్వేర్' తాను ఆ పాత్ర చేయడంపై నోరు విప్పింది. అలాంటి క్యారెక్టర్ చేయడం తనకు కూడా నచ్చలేదంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. అనుపమ మాట్లాడుతూ.. 'టిల్లు స్క్వేర్' లో నటిస్తున్నసమయంలో తాను సౌకర్యంగా ఫీల్ అవ్వలేదని చెప్పింది. చాలా సమయం తీసుకున్న తర్వాత ఆ పాత్ర చేయడానికి ఒకే చేశానుని చెప్పుకొచ్చింది. లిల్లీ పాత్ర చేయడం తనకూ నచ్చలేదని, 100% కాన్ఫిడెంట్ గా ఆ క్యారెక్టర్ చేయలేదని వివరించింది. కానీ, ఇండస్ట్రీలో నచ్చని విషయాలు చెబితే యాటిట్యూడ్ అంటరాని సంచలన వ్యాఖ్యలు చేసింది. అనుపమ చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఇదిలా ఉంటే అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం 'పరదా' ప్రమోషన్స్ తో బిజీగా ఉంది. ఇందులో అనుపమ 'సుబ్బు' అనే ఒక పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపించబోతుంది. ఇటీవలే మూవీ ట్రైలర్ విడుదలవగా.. పల్లెటూరి అమ్మాయిగా అనుపమ నటన, ఆమె అమాయకత్వం ఆకట్టుకున్నాయి. ఒక గ్రామం, అక్కడి కట్టుబాట్లు, ఆచారాల చుట్టూ తిరిగే కథాంశంగా 'పరదా' చిత్రాన్ని రూపొందించారు. ఈ కట్టుబాట్లు, సంప్రదాయాల సవాళ్ళను ఎదుర్కొని ఒక మహిళా ఎలా శక్తివంతంగా నిలిచింది అనే అంశాన్ని సినిమాలో చూపించబోతున్నారని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. 'పరదా' చిత్రం ఈ నెల 22న దేశవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల కానుంది.







# మంచిర్యాల జిల్లాలో కుండపోత

- 10 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- కన్నెపల్లి మండలంలో అత్యధికం
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్
- అప్రమత్తంగా ఉండాలని సూచన

**మంచిర్యాల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)** జిల్లాలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కుండ పోతగా కురిసిన భారీ వర్షం కారణంగా పలు మండలాల్లో రోడ్లు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. భారీ వర్షంతో పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా కన్నెపల్లి మండలం సాలిగాంలో ఇళ్లలోకి నీరు చేరింది. భీమిని మండలం ఖర్జిభీంపూర్ గ్రామంలో చెరువు మత్తడి తెగింది. ముంపు గ్రామాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా 08736-250501 టోల్ ఫ్రీం నంబర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కాగా భారీ వర్షం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో 10.9 సెంమీ. సగటు వర్షపాతం నమోదైంది. గరిష్టంగా జిల్లాలోని కన్నెపల్లి మండలంలో 24.0 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఇంతటి భారీ వర్షం కురియడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద...**

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని హాజీపూర్ మండలంలోగల ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చినీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట ఎత్తు 148 మీటర్లకుగాను ప్రస్తుతం 145.64 మీటర్లకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను 14.069 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి 19,062 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు మూడు గేట్లు తెరిచి 11,478క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. లోకల్ క్యాచ్‌మెంట్ ద్వారా మరో 7,584 క్యూసెక్కులు చేరుతోంది. ప్రాజెక్టు అవుట్ ఫ్లో 451 క్యూసెక్కులు ఉండగా హైద్రాబాద్ మెట్రోపాలిటన్ వర్క్ స్కీం కోసం 330 క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకు 121 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**మత్తడి దూకుతున్న నీల్వాయి ప్రాజెక్ట్..**

మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి నీల్వాయి ప్రాజెక్టు మత్తడి దూకుతోంది. మత్తడిని బుధవారం ఎంపీడీవో కుమారస్వామి, నాయబ్ తహసీల్దార్ సాయికృష్ణ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలకు పలు గ్రామాల్లోని పత్తి, వరి పంటలు నీట మునిగాయి. రోడ్లపై వరద నీరు ప్రవహించి కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ముత్తాపూర్ నుంచి వేమనపల్లికి వెళ్లే రోడ్డుపై భారీగా వరద నీరు చేరడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...**

భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు జలమయమైన చిన్నతిమ్మాపూర్, ఖర్జిభీంపూర్ గ్రామాల్లో ఆయన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కలిసి సందర్శించారు. ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలు చేపడతారని భరోసా ఇచ్చారు. రైతుల పంట పొలాలో విద్యుత్ మోటర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగులు, చెరువుల వద్దకు ప్రజలు ఎవ్వరూ వెళ్లవద్దన్నారు. అత్యవసరం ఐతేనే బయటకు రావాలని సూచించారు. చిన్నతిమ్మాపూర్‌లో ఎర్రవాగు, నల్లవాగు బ్యాక్ వాటర్ లో మునిగిన పంటలను పరిశీలించారు. పెద్దపేట, రాజారం గ్రామాల మధ్యలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును, ఖర్జిభీంపూర్ గ్రామంలో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్డు, వంతెనను పరిశీలించి వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పెద్దపేట గ్రామంలో మునిగిన పంటలను సబ్ కలెక్టర్ మనోజ్, ఏడీఏ సురేఖ పరిశీలించి రైతులు అధైర్యపడవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బికర్ణదాస్, ఎంపీడీవో గంగామోహన్, ఎస్సై విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.





**అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి..**

వర్షాల నేపథ్యంలో ప్రజల రక్షణకు అధికార యంత్రాంగం అప్రమత్తత చర్యలు చేపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కన్నెపల్లి మండలంలోని సాలిగాం గ్రామంలోని పాల్వాయి పురుషోత్తం రావు ప్రాజెక్టును బ్యాక్ వాటర్ పరిస్థితిని పరిశీలించి ప్రమాద స్థాయిలో ఉన్న ఇళ్ల ప్రజలను పునరావాసంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాక్ వాటర్‌కు ముంపునకు గురవుతున్న ఇళ్ల యజమానులు అధైర్య పడవద్దని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను నిర్వహించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ఫాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. వర్షాల నేపథ్యంలో అధికారులందరు అందుబాటులో ఉండాలని అవసరమైన ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎవైనా సంఘటనలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

**బెల్లంపల్లి రాంనగర్ వాగును పరిశీలించిన కలెక్టర్**

గత రెండు రోజులుగా కురుస్తున్న ఏకధాటి వర్షాల కారణంగా పొంగిపొర్లుతున్న బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్ వాగు అండర్ బ్రిడ్జిని బుధవారం మధ్యాహ్నం మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ పరిశీలించారు. రాంనగర్ ప్రాంతంలో రాకపోకలు సాగేలా సహాయక చర్యలను వేగం చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కానీల్లో వరద నీరు నిలువ కుండ సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ టి.రమేష్, సిబ్బంది ఉన్నారు.








# పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నా

**ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ వివరాలు తెలియజేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి కార్మికులతో కలసి వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూ సీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మల్లేశ్ పాల్గొన్నారు. కాగజ్న

### కాగజ్‌నగర్‌లో విధులు బహిష్కరించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

గర్‌లోని సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం రెండో రోజూ విధులు బహిష్కరించారు. పీఎఫ్ డబ్బులు చెల్లించడం లేదని, వేతనాలు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దవాఖాన అపరిశుభ్రంగా మారడంతో ప్రైవేట్ వ్యక్తుల చేత శుభ్రం చేయించే యత్నం చేయగా, ఉద్యోగులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో మాట్లాడారు. కొద్ది రోజుల్లో సమస్య పరిష్కరించేలా చూస్తానని, విధులకు హాజరు కావాలని



కోరగా, ఉద్యోగులు విధుల్లో చేరారు.



## హనుమాన్ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

**ముథోల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

నియోజక వర్గ కేంద్రమైన ముథోల్‌లో గల తానూర్ బైపాస్ రోడ్డు ప్రక్కన గల హనుమాన్ మందిరం వద్ద బొగడ వాడకట్టు మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో 4 సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజకవర్గం మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు రోళ్ళ రమేశ్ మాట్లాడుతూ గత కొన్ని నెలల నుండి ముథోల్ లో చాలా దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. ముందు జాగ్రత్తగా చర్యగా సీసీ కెమెరాలు ఆలయంలో ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రోళ్ళ బాలాజీ, తెలుగాడం ధర్మన్న, హంగీర్గ లక్ష్మణ్, సంఘం మెంబర్లు వెంకటపురం పోతన్న, హంగీర్గ భోజన్న, భూమన్న,పోతన్న, గంగాధర్, సాయిలు, రాములు, సురేష్, ఈరన్న, సాయినాథ్, గంగాధర్, పోశెట్టి, శంకర్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

## జన్నారంలో భారీ వాహనాల రాకపోకలకు అనుమతి



**మంచిర్యాల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

భారీ వాహనాల రాకపోకలకు ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో సామాజికవేత్త భూమాచారి, బీజేపీ ఎస్టీ సెల్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బద్రీనాథ్‌ల అవిశ్రాంత పోరాటమే ఈ విజయానికి కారణమని వాసవి సేవాదళ్ జన్నారం మండల సభ్యులు ప్రశంసించారు. బుధవారం రాత్రి జన్నారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరినీ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## తుడం దెబ్బ డివిజన్ అధ్యక్షుడిగా రాంషావ్ నియామకం



**ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ డివిజన్ తుడుందెబ్బ నూతన అధ్యక్షులుగా కొట్నక రాంషావ్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ బుధవారం నియామక పత్రం అందజేసి, ఆదివాసి హక్కుల సాధన కోసం నీతి నిజాయితీలతో ఉద్యమించాలని సూచించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, జాతి బాగు కోసం కృషి చేస్తానని రాంషావ్ తెలిపారు.

## దంచి కొట్టిన వాన.. కాలనీలు జలమయం

**తాండూర్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

మండలంలో మంగళవారం రాత్రి 9 గంటల నుంచి బుధవారం ఉదయం 9 గంటల వరకు వాన దంచి కొట్టింది. ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురియడంతో పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, సాగుభూములు జలమయంగా మారాయి. బోయపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో వరదనీరు చేరడంతో జలమయంగా మారింది. ఎస్సీ కాలనీకి తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ ఉదయమే చేరుకొని మూడు జేసీబీలను తెప్పించి కాలువలు తీయించి వరదనీటిని బయటకు పంపించారు. అనంతరం తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్ ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఇండ్లలోకి వరదనీరు చేరిన పలు కుటుంబాలను తంగళ్ళపల్లి హైస్కూల్లో వసతి కల్పించి భోజనం ఏర్పాటు చేశారు. తంగళ్ళపల్లిలోని వాణి నివాస పాఠశాల సమీపంలోని కాలనీలో వరదనీరు భారీగా చేరింది. రహదారిపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. మండలంలోని చెరువుల మత్తడి పై నుంచి వరదనీరు ప్రవహించడంతో సాగుభూముల్లో వరదనీరు పారడంతో వరి, పత్తి తదితర పంటలు దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. మండల కేంద్రంలోని మూడు రైల్వే అండర్ బ్రిడ్జీలలో వరదనీరు చేరడంతో అవతలి వైపు గల తాండూర్, రేచిని, అచలాపూర్, గోపాలనగరం, గోపాలరావుపేట తదితర గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచాయి. భారీ వర్షం వలన మండలంలోని ఇళ్లు దెబ్బతిన్నాయి. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

# బీసీ రిజర్వేషన్లను తగ్గించిందే బీఆర్‌ఎస్

### రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి



**మందమర్రి, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రం లో బీసీల రిజర్వేషన్లను తగ్గించింది బీఆర్ఎస్ అని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తుంటే బీఆర్ఎస్ బీసీ రాగం అందుకోవడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి విమర్శించారు. బుధవారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ పార్టీ బీసీల కోసం ఏం చేసిందో జవాబు చెప్పాల న్నారు. బీసీలు రాజకీయంగా ఎదిగితే తాము ఎక్కడ దెబ్బతింటామోనని ఆఊసె ఎత్తలేదన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. అనంతరం ఆర్డినెన్స్ జారీ చేసి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపామని వివరించారు. మూడు నెలల్లోగా ఆమోదించకపోతే సుప్రీంకోర్టు తీర్పుప్రకారం చట్టం అవుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలపై గవర్నర్‌కు వినతి



**ఆదిలాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను ఎంపీ గోడం నగేశ్ కలిశారు. బుధవారం గవర్నర్‌ను కలిసి గిరిజన ఉద్యోగుల, గిరిజన ప్రాంత సమస్యలపై గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా5వ షెడ్యూల్ ప్రాంత పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి గవర్నర్‌తో చర్చించడం జరిగిందని ఎంపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌ని ఆదిలాబాద్ జిల్లా గిరిజన ప్రాంతాల్లో పర్యటంచాలని ఆహ్వానించానని, త్వరలో జిల్లా పర్యటనకు వస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు ఎంపీ పేర్కొన్నారు.



## కలెక్టరేట్‌లో మొక్కలు నాటిన సమాచార శాఖ కమిషనర్లు

**నిర్మల్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీకృత భవనంలో బుధవారం రాష్ట్ర ప్రధాన సమాచార హక్కు కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కమిషనర్లు పర్వీజ్ భూమేష్‌లు తెలంగాణ హరితవనంలో భాగంగా మొక్కలు నాటి నీళ్ళు పోశారు. హరితవనాల ఏర్పాటుతో పర్యావరణం పరిరక్షించబడుతుందని మొక్కలు నాటి పెంచవలసిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, బైంసా సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి, అధికారులు ఉన్నారు.

## ధర్మపురికి అభినందనలు



**ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025 కోసం జాతీయ స్వతంత్ర జ్యూరీ బుధవారం నిర్వహించిన ముఖాముఖిలో జిల్లా నుంచి ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ధర్మపురి వేంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొన్న ఆరుగురు ఉపాధ్యాయుల్లో వేంకటేశ్వర్లు ఒకరు. రాష్ట్రం నుంచి 150 మంది దరఖాస్తు చేసుకోగా ఆరుగురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర్లు పాఠశాల విద్యా ప్రగతిని, విద్యార్థుల ప్రగతిలో వినూత్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తఅభినందించారు. సంయుక్త సంచాలకులూ మదన్మోహన్, ఆర్ జే డీ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

## అదృశ్యమయ్యాడు.. శవమై దొరికాడు

**ఉట్నూర్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన అర్క గంగారం అనే గిరిజనుడు ఆదివారం రాత్రి నుండి కనిపించడం లేదు. మృతుడు తుకారాం గూడ గ్రామానికి దేవురావ్ చేనులో మృతి చెంది ఉన్న విషయం అటుగా వెళ్ళే వారికి తెలియడంతో వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. అదృశ్యమై శవమై కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

## కవ్వాల్ టైగర్ జోన్‌లో జెండా ఊపి

# భారీ వాహనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే








**జన్నారం, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల రాకపోకలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మంచిర్యాల డీఎఫ్ఓ శివ్‌ఆశిష్ సింగ్ బుధవారం పచ్చజెండా ప్రారంభించారు. మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తపాల్‌పూర్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ 16 టైర్ల లారీకి పచ్చజెండా ఊపి, రూ.150 రుసుము చెల్లించి రసీదు తీసుకున్నారు. అనంతరం అదే లారీలో కూర్చుని జన్నారం వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనుమతులు లభించిన నేపథ్యంలో భారీ వాహనాలను మోటారు వాహన చట్టం ప్రకారం నడపాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే భారీ లారీలు నడపాలని, అలాగే వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం తక్కువ వేగంతో ప్రయాణించి వన్యప్రాణులకు హాని కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో జన్నారం ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి. సుష్మారావు, తాళ్లపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చెట్ల సాగరిక, ఫారెస్ట్ సెక్షన్, బీట్ ఆఫీసర్లు నహీదా పర్వీన్, రైమోద్దీన్, కృష్ణమూర్తి, పద్మజరాణి, స్థానిక ఎస్సై గొల్లపల్లి అనూష పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు కుచ్చు టోపీ పెట్టిన కృష్ణ అరెస్ట్

### వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ

### జిల్లాలో దాదాపు 16 కేసులు





**ఆదిలాబాద్, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఎస్.కె మైక్రో ఫైనాన్స్ పేరుతో ఉద్యోగాలు ఇస్తానంటూ పెద్ద ఎత్తున మోసం చేసి ఫరారైన కృష్ణను పోలీసులు అరెస్ట్ చేసారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట ఉద్యోగాలు ఇప్పిస్తానంటు ఎస్కే గ్రూప్ కృష్ణ ఎన్ఆర్ఐ అంటూ, సామాజిక సేవ పేరుతో ప్రముఖులతో పరిచయాలు చేసుకొని వందల మందిని బురిడీ కొట్టించి పరారయ్యాడు. బాధితుల పిర్యాదుతో రంగంలోకి దిగిన ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ఎట్టకేలకు చాకచక్యంగా కృష్ణ ను పట్టుకున్నారు.

**ఎన్నారైనంటూ బిల్డప్...**

డిజిటల్ మైక్రో ఫైనాన్స్, ఆసుపత్రుల్లో, అంగన్వాడీల వద్ద ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వందల మందిని మోసం చేసిన ప్రధాన నిందితుడు జవాదే కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్పి తెలిపారు. ఇంద్రవెల్లి మండలంలోని శంకర్ గూడ గ్రామానికి చెందిన కృష్ణ, ఆర్.ఎంపీగా ప్రాక్టీస్ చేస్తూ గత కొన్నేళ్ల క్రితం జిల్లా నుండి ఇతర రాష్ట్రాల్లో తిరిగేవాడు. అలా ఇతను మహారాష్ట్రలోని పూనా, బారామతిలో సోనాయి కాంప్లెక్స్ వద్ద ఉండేవాడు. అక్కడ కూడా కోవిడ్ సమయంలో ఇతను మోసాలకు పాల్పడ్డాడు. అనంతరం గత ఏడాది జిల్లాలో విదేశాల్లో ఉండి వచ్చానని సామాజిక సేవలు చేస్తున్నానని, పరిచయమై డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల వద్ద డబ్బులు వసూలు చేసి కుచ్చుటోపి పెట్టాడు. డబ్బులు వసూలు చేసి, జల్సాలకు తిరుగుతూ ఖర్చు చేసి, సామాజిక సేవ పేరుతో ప్రముఖుల పరిచయాలతో ప్రచారం చేసుకుని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 300 మందిని మోసం చేశాడు. నిందితునిపై ఆదిలాబాద్ దాదాపు 16 కేసులు నమోదయ్యాయి.

**మైక్రో ఫైనాన్స్ పేరుతో మొదట మోసాలు...**

నిందితుడు కృష్ణ 2024 సంవత్సరం డిసెంబర్ లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో, ఉట్నూర్ లో ఎన్నారై అంటూ ఎస్కే మైక్రో ఫైనాన్స్ పేరుతో కార్యాలయాలను ప్రముఖులతో ప్రారంభించి తన నేర పద్ధతిని ప్రారంభించాడు. మైక్రో ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానని జిల్లా వ్యాప్తంగా రెండు కార్యాలయాలలో దాదాపు 300 మంది వద్ద 20 వేల రూపాయల మెంబర్షిప్ పేరుతో వసూలు చేశాడు. ప్రభుత్వ ఆసుపత్రుల నందు స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం మరియు అంగన్వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానని కొంతమంది వద్ద డబ్బులను తీసుకోవడం చేసి మోసం చేశాడు. మొదటగా ఈ రెండు కార్యాలయాల్లో ఐదుగురు ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం వారి ద్వారా నగదు రూపంలో ఒక్కొక్కరి వద్ద 20 వేల రూపాయలను తీసుకొని దాదాపు జిల్లా వ్యాప్తంగా 54 లక్షలు అదే విధంగా ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాల పేరుతో 15 లక్షలు వసూలు చేసి మొత్తం 69 లక్షల ఇప్పటివరకు వసూలు చేశాడు. డిసెంబర్ నుండి ఆరు నెలల పాటు ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బాధితులు తరచూ అడుగుతూ ఉండడంతో జులై నెల మొదటి వారంలో తన సొంత గ్రామం శంకర్ గుడాలో తొమ్మిది లక్షల నగదు మూడు లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు దాచి, 15 లక్షల నగదుతో పారిపోయాడు.

**అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు...**

ఇతని వద్ద నుండి దాదాపు తొమ్మిది లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు 5.5 తులాల బంగారు ఉంగరాలు, 1.2 తులాల బంగారు కాయిన్స్, 4 తులాల బంగారు చైన్ (3 చైన్లు), మొత్తం 10.7 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల దగ్గర దోచుకున్న డబ్బులతో బంగారు ఆభరణాలు, కారు కొన్నట్లు తెలిపారు. ప్రజల వద్ద నుండి విడతలవారీగా మోసం చేసి తీసుకున్న డబ్బులలో ఆరు లక్షలు ఆదిలాబాద్‌లో ఒక ప్రైవేటు హోటల్ యజమానికి, ఆరు లక్షలు నాగపూర్‌లోభవన యజమానికి, 3.5 లక్షలు ఆదిలాబాద్ ఉట్నూర్ కార్యాలయాలకు, 2.1లక్షలు తమ్ముని అవసరాల నిమిత్తం ఇచ్చి, మిగిలినవి జల్సాలకు తప్పించుకోవడానికి ఖర్చు చేశాడు.



విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY




### హైకోర్టు ఆదేశాలతో

### ఓరియంట్ సిమెంట్

## కంపెనీలో ఎన్నికలు

**కాసిపేట, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ ఆదాని కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కార్మిక శాఖ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించనున్నారు. కంపెనీ ఆవరణలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 257 మంది కార్మికులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఐదు యూనియన్లకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండగా యూనియన్లకు గుర్తులను కేటాయించారు. ఈ నెల 14న మధ్యాహ్నం 12 గంటల వరకు సమయం విత్‌డ్రా, 18న ప్రచారం ముగించాలని కార్మిక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఎన్నికలు జరగుతాయా లేదా అనే సందిగ్ధంలో ఉన్న ఓరియంట్ గుర్తింపు సంఘం ఎన్నికలు చివరకు హైకోర్టును ఆశ్రయించడం అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు పాఠశాలలకు సెలవు

**మంచిర్యాల, ఆగస్టు 13 (ప్రభాత సమాచారం)**

వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 14వ తేదీన జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని యాజమాన్యాల క్రింద నిర్వహించబడుతున్న పాఠశాలలకు సెలవు ఇవ్వడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.